
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
ఆదివారం 27 అక్టోబరు 2024





వావ్.. గోల్ గుమ్మజ్..!



- విస్తీర్ణంలో అతి పెద్ద గుమ్మజ్‌గా ఖ్యాతి
- నాలుగు శతాబ్దాల పురాతన కట్టడం
- నగరంలో పర్యాటకులను ఆకర్షిస్తోన్న గోల్ గుమ్మజ్

ఆ పక్కన హంద్రీ నది. దాని ఒడ్డునే అందాల గుమ్మజ్. కర్నూలు వాసులకు ఇదొక అద్భుత ప్రదేశం. ఈ గోల్ గుమ్మజ్‌ను చూసి ఎవరైనా పులకరించి పోవాల్సిందే. నవాబుల నాటి రాచఠీవిని ఒలుకబోస్తూ అత్యంత సుందరంగా కనిపించే గుమ్మజ్ వద్ద కూర్చుని సేదతీరేవారెందో. కానీ నేడు హంద్రీ జలకళ లేకున్నా నాటి రాచరిక దర్పానికి నిదర్శనంగా ఈ చారిత్రక కట్టడం చెరగని ప్రాభవాన్ని చాటుకుంటోంది. భారతదేశంలో కెల్లా అతిపెద్ద గోల్ గుమ్మజ్‌గా పేరొందిన ఈ కట్టడం ఆగ్రాలోని తాజ్‌మహల్, బీజాపూర్‌లోని గోల్ గుమ్మజ్‌ల కన్నా నిర్మాణ వైశాల్యంలో ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. కర్నూలు చార్రితక ప్రాధాన్యతలో ఇది భాగం.

వివరాలు 6 లో..

ఏపీ ప్రభుత్వం X తుంగభద్ర బోర్డు


తుంగభద్ర దిగువ కాలువకు చేసిన ఆర్‌సీసీ లైనింగ్ (ఫైల్)

కర్నూలు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ప్రభుత్వానికి, తుంగభద్ర బోర్డుకు మధ్య వివాదం తలెత్తింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తుంగభద్ర కాలువల ఆర్‌సీసీ లైనింగ్ కోసం పిలిచిన టెండర్లలో నిబంధనలను పాటించలేదని, ఆనాటి వైసీపీ నాయకులు అవినీతికి పాల్పడి చీకటి ఒప్పందాలు చేసుకున్నారనే ఉద్దేశంతో టీడీపీ ప్రభుత్వం ఆ పనులను రద్దు చేస్తూ సెప్టెంబర్ 29న ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆ టెండర్లు రద్దు చేయాల్సిన అవసరం లేదని బోర్డు అధికారులు పేర్కొన్నారు. పైగా ఏపీ ప్రభుత్వ ఆదేశాలు తమకు వర్తించవని తుంగభద్ర బోర్డు అధికారులు అంటున్నారు. ఈ వివాదం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

- గత టెండర్లు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సర్కార్
- ఆ ఉత్తర్వులు వర్తించవంటున్న టీబీపీ బోర్డు
- వైసీపీ హయాంలో ఎల్లెల్సీ, హెచ్చెల్సీ లైనింగ్ కోసం రూ.400 కోట్లతో టెండర్లు
- ఇప్పటికీ పనులు మొదలు పెట్టని టీబీపీ బోర్డు ఇంజనీర్లు
- గత టెండర్లు రద్దు చేయాలంటూ సీఎంకు, బోర్డుకు ఓ కాంట్రాక్టరు ఫిర్యాదు

తుంగభద్ర కాలువలకు ఆర్‌సీసీ లైనింగ్ కోసం దాదాపు రూ.400 కోట్లతో గత ప్రభుత్వం టెండర్లకు పిలిచింది. ఇందులో కర్నూలు జిల్లాకు చెందిన అప్పటి ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలు బళ్లారిలో మకాం వేసి కాంట్రాక్టర్లకు పనులు పంపకాలు చేశారు. తెర వెనుక చక్రం తిప్పిన ఆ ఎమ్మెల్యేలకు 5 శాతం వాటా ఇచ్చేలా చీకటి ఒప్పందం కుదుర్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టర్లు వివిధ కారణాల వల్ల పనులు మొదలు పెట్టలేదు. ఆ తరువాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం.. గత ప్రభుత్వ హయాంలో టెండర్లు పూర్తి చేసి మొదలు పెట్టని పనులను, 25 శాతంలోపు పురోగతిలో ఉన్న పనులను రద్దు చేయాలంటూ సెప్టెంబరు 29న ఆదేశాలు జారీ చేసింది. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు బోర్డుకు వర్తించవని, ఆ టెండర్లు రద్దు చేయాల్సిన అవసరం లేదని బోర్డు అధికారులు అనడం వివాదాస్పదంగా మారింది.

తుంగభద్ర జలాశయం నుంచి కర్నూలు జిల్లాలో సాగు, తాగునీరు అందించేందుకు 24 టీఎంసీలు వాటా కలిగిన టీబీపీ ఎల్లెల్సీ కాలువ 0/0 కి.మీల నుంచి కర్నూలు జిల్లా ఆదోని మండలం హానవాల్ గ్రామం దగ్గర 250.850 కి.మీల వరకు, అనంతపురం జిల్లాలో సాగు, తాగునీరు అందించేందుకు 31.50 టీఎంసీలు నికర జలాలు వాటా ఉన్న టీబీపీ హెచ్చెల్సీ కాలువ 0/0 నుంచి అనంతపురం జిల్లా బొమ్మనహాల్ సమీపంలో 105 కిలో మీటర్ల వరకు తుంగభద్ర ప్రాజెక్టు (టీబీపీ) బోర్డు పర్యవేక్షణలో ఉంది. 1955లో తుంగభద్ర కాలువలు నిర్మించడం వల్ల కాల్వ గట్టు పలు ప్రాంతాల్లో బలహీనంగా మారింది. పూడిక నిండిపోయింది. దీనికి తోడు ఎగువన కర్నాటక జలచౌర్యం వల్ల వాటా జలాలు అందడం లేదు. తంగభద్ర డ్యాంలో చేరే వరదను టీబీపీ బోర్డు వాటర్ రివ్యూ కమిటీ అంచనా ఎల్లెల్సీ కాల్వకు సగటున 16-18 టీఎంసీలు కేటాయిస్తారు. పూర్తి వాటా నీటిని తీసుకోవాలంటే ఎల్లెల్సీ ఆధునికీకరణలో భాగంగా కర్నూలు జిల్లా పరిధిలో 115.275 కి.మీల నుంచి 205.45 కి.మీల వరకు రూ.448 కోట్లతో చేపట్టే 9 ప్యాకేజీలకు 2022 ఫిబ్రవరి 26న టీబీపీ బోర్డు సూపరింటెండెంట్ ఇంజనీరు (ఎస్‌ఈ) అడ్మినిస్ట్రేషన్ అప్రూవల్ ఇచ్చారు. అదే ఏడాది మార్చి 4న టెండరు ప్రక్రియ పూర్తి చేసి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. దాదాపుగా ఈ పనులు పూర్తయ్యాయి. పనులు చేసిన కాంట్రాక్టర్లకు సుమారుగా రూ.319 కోట్లు వరకు బిల్లులు బకాయి ఉన్నాయని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

మిగతా 6 లో..

పత్తి కొనుగోలుకు సమాయత్తం

- కర్నూలులో 12, నంద్యాలలో 3 సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- రైతు సేవా కేంద్రాల్లో వివరాలు అందించాలని ఏడీఎం నారాయణమూర్తి విజ్ఞప్తి 6

పత్తి ధర పతనం

ఒక్క రోజులోనే రూ.300 పైగా తగ్గిన వైనం 6

విద్యతో పాటు క్రీడలు అవసరం

- ఆర్‌యూ వీసీ ఎన్‌టీకే నాయక్
అంతర్ కళాశాలల పురుషుల క్రీడా పోటీలు ప్రారంభం 7

సీ ప్లేన్ ల్యాండ్ పాయింట్ ప్రాంతాల పరిశీలన


పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

శ్రీశైలం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం పాతాళ గంగలోని కృష్ణానదిపై సీ ప్లేన్ ల్యాండ్ పాయింట్‌గా గుర్తించిన ప్రదేశాలను కలెక్టర్ జి. రాజకుమారి అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. శ్రీశైలంలో కృష్ణానదిపై త్వరలో వాటర్ ఎయిర్ డ్రోమ్(సీప్లేన్) సేవలు రానున్నాయి. అ నేపథ్యంలో నవంబరు రెండు లేదా మూడో వారంలో విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి శ్రీశైలం వరకు సీప్లేన్ ట్రయల్ రన్ నిర్వహించే అవకాశం ఉంది. కలెక్టర్ మాట్లాడుతూ సీప్లేన్ ల్యాండ్ పాయింట్ నిర్వహణకు తగ్గ ఏర్పాట్లను చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం సుండిపెంటలోని ఐటీడీఏ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ

- ప్రతి ఒక్కరూ పార్టీ సభ్యత్వం తీసుకోవాలి
- రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్న మంత్రి బీసీ


టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయం ఆవరణలో టీడీపీ సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని శనివారం లాంచనంగా ప్రారంభించారు. ముందుగా రూ.లక్ష చెల్లించి మంత్రి బీసీ టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో టీడీపీ సభ్యత్వాన్ని నమోద చేయనున్నట్లు తెలిపారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు ఏమైనా ప్రమాదాల్లో మృతి చెందితే రూ.5లక్షల ఆర్థిక సాయం పార్టీ తరపున ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి కార్యకర్త వంద రూపాయలు చెల్లించి పార్టీ సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. దేశంలో ఏ పార్టీ చేయని విధంగా కార్యకర్తల సంక్షేమం కోసం టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయాలు తీసుకుంటారని అన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో సభ్యత్వం తీసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కాశీంబాబు, వెంకటాపురం నాగేశ్వరరెడ్డి, సౌదరదిన్నె రామసుబ్బారెడ్డి, గడ్డం అమరనాథరెడ్డి, కానాల శేషారెడ్డి, బురానుద్దీన్, పూల కలాం, అల్తాఫ్‌హుసేన్, గౌండాబాబు, రాయలసీమ సలాం, ఆదిహుసేన్‌రెడ్డి, కానాల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్ ప్రారంభం


ఆయుధాలను చూపుతూ వాటి పనితీరును విద్యార్థులకు వివరిస్తున్న ఎస్పీ


నంద్యాల క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా శనివారం ఓపెన్‌హౌస్‌ను ప్రారంభించారు. ముందుగా ఎస్పీ పోలీసు జాగిలం హనీ హ్యాండ్లర్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఆయుధాల ప్రదర్శనను ప్రారంభించి విధి నిర్వహణలో పోలీసులు ఉపయోగించే ఆయుధాలు, వాటి పనితీరు, పరికరాలు, సాంకేతిక సాధనాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరుల త్యాగాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎస్.యుగంధర్‌బాబు, ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్లు, స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

హెరిటేజ్


చారిత్రక కట్టడం చెరగని ప్రాభవం

- విస్తీర్ణంలో అతి పెద్ద గుమ్మజ్‌గా ఖ్యాతి
- నాలుగు శతాబ్దాల పురాతన కట్టడం
- నగరంలో పర్యాటకులను ఆకర్షిస్తోన్న గోల్ గుమ్మజ్





కర్నూలు కల్చరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో హంద్రీ నది ఒడ్డున, ఉస్మానియా కళాశాల పక్కన గల గోల్ గుమ్మజ్ అందర్నీ అబ్బుర పరుస్తుంది. దీన్ని నిర్మించి 400 ఏళ్ల సంవత్సరాలు కావస్తున్నా గుమ్మజ్ చెక్కు చెదరని కట్టడంగా నిలిచి ఉంది. రాయికి మధ్య రాయి అమర్చి అతిపెద్ద గుమ్మజ్‌ను నిర్మించడంలో ఆనాటి ఇంజనీర్ల నైపుణ్యతకు అద్దం పడుతోంది. ఈ గుమ్మజ్‌ను ఆనాటి ఢిల్లీ మొగల్ చక్రవర్తి ఔరంగజేబు పాలనలో నిర్మించారని చరిత్ర చెబుతోంది. 1565లో విజయనగర సామ్రాజ్యాన్ని నవాబులు జయించాక ఈ ప్రాంతం వారి పాలన కిందకు వెళ్లిపోయింది. అలా కర్నూలు, ఆదోని, నంద్యాల ప్రాంతాలు బీజాపూర్ సుల్తానుల చేతికి వెళ్లాయి. 1573లో బీజాపూర్ సుల్తాన్ ఆదోని ప్రాంతాన్ని జయించాడు. 16వ శతాబ్దంలో బీజాపూర్ సుల్తానులు అబ్దుల్ వహాబ్ ఖాన్‌ను కర్నూలు ప్రాంతాన్ని ఆక్రమించుకోవడానికి కర్నూలుకు పంపించారు. ఆ సమయంలో కర్నూలు కోటను శ్రీరంగరాయలు కుమారుడైన గోపాలరాజు పరిపాలిస్తూ ఉండేవాడు. అబ్దుల్ వహాబ్ తన సైన్యాన్ని రహస్యంగా తుంగభద్ర నదికి అవతల ఉన్న గొందిపర్ల కొండల చాటుకు చేర్చాడు. చీకటిలో శత్రుసైన్యం చేరుకున్న విషయం కర్నూలు సైనికులు పసిగట్టలేకపోయారు. ఉదయం ఒక్కసారిగా అబ్దుల్ వహాబ్ తన సైన్యంతో కర్నూలు కోటపై దండెత్తి వచ్చాడు. దీనివల్లే 'కర్నూలుకు గొందిపర్ల చేటు' అనే నానుడి కూడా ఇక్కడ పుట్టింది. యుద్ధానికి సిద్ధంగా లేని సైన్యం చెల్లా చెదరు కాగా, కర్నూలు కోటను విడిచి గోపాలరాజు తుంగభద్ర నదిని దాటుకొని కోట ఉత్తర ద్వారం ద్వారా పారిపోయాడు. ఆయన యుద్ధంలో మరణించాడా, లేదా ఎక్కడికైనా వెళ్లిపోయాడా అనే అంశానికి ఆధారాలు దొరకలేదు. అయితే రోజూ గోపాల్‌రాజు ఒక ద్వారం ద్వారా తుంగభద్రకు స్నానానికి వెళ్లేవారని, అందువల్ల దానికి 'గోపాల్ దర్వాజా' అనే పేరు నేటికీ స్థిరపడి పోయింది.



గురువుకు దక్షిణగా గుమ్మజ్ నిర్మాణం

అబ్దుల్ వహాబ్ కర్నూలు కోటను జయించాక దాని చుట్టుపక్కల ఉన్న బేతంచర్ల, నంద్యాల, శిరువెళ్ల, కోవెలకుంట్ల ప్రాంతాలన్నీ జయించాడు. దీంతో ఈ ప్రాంతం బీజాపూర్ సుల్తానుల పాలనలోకి వెళ్లిపోయింది. అబ్దుల్ వహాబ్ 1602 నుంచి 1618 వరకు పాలించినట్లు చరిత్ర ఆధారాలు ఉన్నాయి. ఈ సమయంలోనే ఆయన కర్నూలు పెద్ద బజార్‌లో వరుసగా కమాన్‌లతో కూడిన అంగళ్లు కట్టించి, రాజవీధిని ఆకర్షణీయంగా తయారు చేశాడు. ఈయన తన గురువు అయిన సయ్యద్ కరీముల్లా ఖాద్రీ తాను మరణించాక తనను సమాధి చేయడానికి ఒక గుమ్మజ్‌ను నిర్మించమని కోరగా, ఆయన కోరిక మేరకు ఈ గోల్ గుమ్మజ్‌ను నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. విస్తీర్ణం దృష్ట్యా ఇది దేశంలోనే పెద్ద గుమ్మజ్‌గా నిలిచింది. అయితే దీని నిర్మాణం పూర్తయ్యాక, కరీముల్లా అందులో సమాధి కావడానికి ఇష్టపడలేదు. దాంతో గురువు ఇష్ట ప్రకారం ఆయన మృతదేహాన్ని గుమ్మజ్ పక్కన గల ఖాళీ స్థలంలో సమాధి నిర్మించారు. అనంతరం అబ్దుల్ వహాబ్ మరణించాక ఆయన దేహాన్ని గుమ్మజ్‌లో సమాధి చేసినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. 1958 సంవత్సరంలో కేంద్ర పురావస్తుశాఖ ఈ చారిత్రక కట్టడాన్ని రక్షణ కోసం తన సంరక్షణలోకి తీసుకుంది. దీన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు జిల్లా అధికారులు కృషి చేస్తున్నారు.

పత్తి కొనుగోలుకు సమాయత్తం



- కర్నూలులో 12, నంద్యాలలో 3 సీసీఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- రైతు సేవా కేంద్రాల్లో వివరాలు ఇవ్వాలి
- అన్నదాతలకు ఏడీఎం నారాయణమూర్తి సూచన

కర్నూలు/కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతుల నుంచి పత్తి కొనేందుకు సిద్ధంగా ఉన్నామని మార్కెటింగ్ శాఖ కర్నూలు ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటానికి రూ.7,521ని సీసీఐ అధికారులు చెల్లించేందుకు నిర్ణయించారని అన్నారు. ఈ మేరకు శ్రీనాగేంద్ర జున్నింగ్ ఫ్యాక్టరీ, జయంత్ కాటన్ ఇండస్ట్రీ, ఎన్‌డీబీఎల్ జిన్నింగ్ అండ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ, శ్రీలక్ష్మి చెన్నకేశవ ఇండస్ట్రీ, ఐసా ఆర్య కాటన్ ఫ్యాక్టరీ, ఎంఎస్ ధరశ్రీ జిన్నింగ్ అండ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ, ఎమ్మిగనూరులో శ్రీమురాజ్ జిన్నింగ్ అండ్ ప్రాసెసింగ్ యూనిట్, శ్రీమహాలక్ష్మి కాటన్ ట్రేడర్స్, శ్రీశివ జిన్నింగ్ ప్రాసెసింగ్ యూనిట్, కల్లూరు మండలంలోని పెంచికలపాడులో మంజిత్ కాటన్ ఫ్యాక్టరీ, మంత్రాలయంలో శ్రీరాఘవేంద్ర ఆగ్రో ఇండస్ట్రీ, మాధవ కాటన్ ఫ్యాక్టరీలలో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నంద్యాలలో మురారి, ఏఎంసీ, మారంలక్ష్మి జిన్నింగ్ మిల్లులో రైతుల నుంచి పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు వెంటనే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందేందుకు తమ పొలం వివరాలను గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఏడీఎం విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- నగర పాలక అధికారులతో మంత్రి టీజీ భరత్ సమీక్ష
- కార్పొరేటర్లు తెలిపిన సమస్యలకు ప్రాధాన్యమివ్వాలి
- మరో ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణానికి చర్యలు

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు సత్వరం పరిష్కరించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. శనివారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో నగర అభివృద్ధి పనులపై నగర పాలక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా సచివాలయ అడ్మిన్లతో మంత్రి సమావేశం అయ్యారు. సచివాలయ సిబ్బంది స్థానిక కార్పొరేటర్లతో సమన్వయం చేసుకుంటూ క్షేత్ర స్థాయిలో చిన్నపాటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఏవైనా కష్టతరమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ క్రమంలో ఓ ప్రైవేటు కంపెనీ ప్రతినిధితో నగరాన్ని అభివృద్ధి చేసే విధంగా వీడియో కాన్ఫరెన్సు ద్వారా వివిధ రకాల సూచనలు, సలహాలు తీసుకున్నారు. త్వరలోనే ఆ కంపెనీ ప్రతినిధి నగరానికి వచ్చి అన్ని విధాలుగా నగరాన్ని స్మార్ట్ సిటీ చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలని మంత్రి కోరారు. అనంతరం అధికారులతో పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు. ముందుగా గత నెల 30న నిర్వహించిన సమీక్షకు సంబంధించిన పనరుల పురోగతిని మంత్రికి అధికారులు వివరించారు. నగరంలో దోమల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు తమ టీజీవి సంస్థల నుంచి హైపో ద్రావణాన్ని ఉచితంగా అందిస్తామన్నారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి ఆదేశించారు. పార్కు స్థలాల అన్యాక్రాంతం, రహదారుల ఆక్రమణపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. గార్గేయపురం డంప్‌యార్డు వద్ద మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ ప్లాంట్ నిర్మాణ పనులపై అడిగి తెలుసుకున్న మంత్రి వాటి నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ ఎస్. రవీంద్రబాబు, అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి. కృష్ణ, ఆరోగ్య అధికారి కే. విశ్వేశ్వరరెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్డీ, జునైద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

భారీగా పతనమైన పత్తి ధర

ఒక్క రోజులోనే రూ.300 పైగా తగ్గిన వైనం



మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని (అగ్రికల్చర్), అక్టోబరు 26, (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శనివారం పత్తి ధర భారీగా పతనమైంది. ఒక్క రోజులోనే క్వింటానికి పత్తి ధర రూ.300 తగ్గింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే పత్తి ధరలు మార్కెట్‌లో పతనం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు పత్తి ధరలు పెరుగుతుందని ఆశించినప్పటికీ ధరలు పతనమవుతుండడంతో తమకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని, పెట్టిన పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేక అప్పుల పాలౌతున్నామని కన్నీరు కారుస్తున్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ కూడా దసర పండుగ రోజు కొనుగోలు చేస్తామని ప్రకటించి పత్తా లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సీసీఐ పత్తిని కొనుగోలు చేసి మద్దతు ధర అయినా అందించాలని రైతుల డిమాండ్ చేస్తున్నారు. 6,546 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ.4,789, గరిష్ఠదర రూ.7,389 మధ్యస్థ ధర రూ.7,189 పలికింది.

మలిపొద్దు వెలుగు



తమ్మరాజుపల్లె సమీపంలో ఆకాశానికి తిలకం దిద్దినట్లుగా సాయం సంధ్యావేళ సూరీడు

వెలుగును కబళిస్తూ చీకట్లు
పడమటి కొండల్లోకి
వాలిపోతూ సూరీడు
మసకబారుతున్న ఆకాశానికి
తిలకం దిద్దినట్లు మలిపొద్దు
విద్యుత్తు తీగలపై
తేలియాడుతున్నట్లు
కనువిందు చేస్తూ...



నంద్యాల పట్టణ సమీపంలో కుందూ ప్రవాహంలో వెండికాంతులీనుతూ పడమటిన వాలిపోతున్న భానుడు

ఓర్వకల్లు మండలం తమ్మరాజుపల్లె - సోమయాజులపల్లె బండ్లకనుమ ఘాట్ రోడ్డు ప్రాంతంలో కనిపించిన దృశ్యాలు ఇవి - కర్నూలు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి)

ఏపీ ప్రభుత్వం వర్సెస్ తుంగభద్ర బోర్డు

5వ పేజీ తరువాయి

కర్నూలు జిల్లా పరిధిలో తుంగభద్ర దిగువ (ఎల్లెల్సీ) 205.45 కి.మీల నుంచి 250 కి.మీల వరకు రూ.300 కోట్లు, అనంతపురం జిల్లాలో హెచ్చెల్సీ రూ.100 కోట్లు కలిపి రూ.400 కోట్లతో ఆర్‌సీసీ లైనింగ్ పనులకు 13 ప్యాకేజీలకు 2023 జనవరి 1న ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు పిలిచారు. నిబంధనలు పాటించలేదని యారో కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్ సంస్థ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చింది. రాజకీయ నాయకులు, కొందరు టీబీపీ బోర్డు అధికారులు ఆ కాంట్రాక్ట్ సంస్థపై ఒత్తిడి తీసుకొచ్చి స్టే ఎత్తివేయించారని సమాచారం. కర్నూలు జిల్లాకు చెందిన అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలు రంగ ప్రవేశం చేసి బళ్లారిలో మకాం వేసి పనులను కాంట్రాక్టర్లకు పంపకాలు చేశారు. ఇందుకు ఆ ఎమ్మెల్యేలకు 5 శాతం వాటా అంటే దాదాపు రూ.20 కోట్లు ఇచ్చేలా ఒప్పందం జరిగినట్లు సమాచారం. ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లలో ఆ కాంట్రాక్టరు ఒక్కటే షెడ్యూలు దాఖలు చేసేలా రాజకీయ ఒత్తిళ్లు తీసుకొచ్చి 5 శాతం అధిక ధరలకు పనులు దక్కించుకున్నారని తెలుస్తోంది. టీబీపీ బోర్డు ఇంజనీర్లు ఒప్పందం కూడా చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సాధారణ ఎన్నికలు రావడంతో కాంట్రాక్టరు పనులు మొదలు పెట్టలేదు. ఆ ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ కూటమి సీఎం చంద్రబాబు సారథ్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి.. మొదలు పెట్టని పనులు సహా 25 శాతంలోపే పురోగతి ఉన్న పనులు రద్దు చేస్తూ టీడీపీ కూటమి ప్రభుత్వం గత నెల సెప్టెంబరు 27న ఫైనాన్స్ యూఓ నోట్ నంబరు: 2569644 ఆదేశాలు జారీ చేసింది.

ఆ ఉత్తర్వులు వర్తించవు..!

తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు సమావేశంలో తీసుకునే నిర్ణయాలే కీలకమని, ఏపీ ప్రభుత్వం ఆదేశాలు వర్తించవని బోర్డు అధికారులు అంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి ఇప్పటికీ మొదలు పెట్టని ఆ పనులు రద్దు చేయబోమని వారు తేల్చిచెబుతున్నారు. ఏపీ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబరు-94 ప్రకారం టెక్నికల్, అడ్మినిస్ట్రేషన్ అప్రూవల్ తీసుకుని, ఏపీ ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో టెండర్లు పిలిచినప్పుడు.. ఇంకా మొదలు కాని పనులు రద్దు చేస్తూ ఏపీ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు ఎందుకు వర్తించవని కాంట్రాక్టర్లు ప్రశ్నిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాటి వైసీపీ ఎమ్మెల్యేల సిఫారసు మేరకు టెండర్లు వేసిన ఆ పార్టీతో సన్నిహిత సంబంధాలు కలిగిన కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చేందుకే బోర్డు అధికారులు ఇలాంటి వాదనలు తెరపైకి తెస్తున్నారని, ఏపీ ప్రభుత్వం రూల్స్ పాటించాలని బోర్డు నిబంధనల్లో స్పష్టంగా ఉందని ఓ కాంట్రాక్టరు పేర్కొన్నారు. ఆర్‌సీసీ లైనింగ్ పనులకు మళ్లీ టెండర్లు పిలవాలని ఓ కాంట్రాక్టరు తుంగభద్ర బోర్డుకు లేఖ రాశారు. పనులు రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలిస్తే పోటీ పెరిగి 5 శాతం తక్కువ (లెస్)కు టెండర్లు వేసే అవకాశం ఉందని, తద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.40 కోట్లు వరకు ఆదా అవుతుందని, దీనిపై ఏపీ సీఎం చంద్రబాబుకు కూడా ఫిర్యాదు చేస్తామని కాంట్రాక్టరు పేర్కొన్నారు. దీనిపై టీబీపీ బోర్డు ఇన్‌చార్జి ఎస్ఈ నీలకంఠరెడ్డిని ఆంధ్రజ్యోతి ఫోన్లో వివరణ కోరగా అదనపు నిధులతో ఎల్లెల్సీ లైనింగ్ పనులు చేపట్టారన్నారు. ఏపీ ప్రభుత్వం 55 శాతం, కర్ణాటక ప్రభుత్వం 45 శాతం నిధులు చెల్లిస్తుందన్నారు. టెండర్లను బోర్డు ఆమోదించడంతో రద్దు చేయాల్సిన అవసరం లేదని, దీనికి ఏపీ ప్రభుత్వం ఆదేశాలు వర్తించవని పేర్కొనడం కొసమెరుపు.



తుంగభద్ర దిగువ కాలువ

ఉల్లి సమస్యపై మంత్రి అచ్చెన్నాయుడు సమావేశం

- ఈనామ్ సర్వర్‌ను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలి
- మార్కెటింగ్ శాఖ అధికారులకు ఆదేశం
- కలెక్టర్, మార్కెటింగ్ అధికారులకు పలు సూచనలు



కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా రైతుల్ని, మార్కెటింగ్ శాఖ అధికారులను ముప్పతిప్పలు పెడుతున్న ఈనామ్ సర్వర్‌లో ఆటంకం సమస్యపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. ఉల్లి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై శనివారం గుంటూరులోని తన చాంబరులో మార్కెటింగ్‌శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించినట్లు మార్కెటింగ్ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. వేలల్లో పేరుకుపోయిన ఉల్లి నిల్వలను అవసరమైన లారీలను ఏర్పాటు చేసి బయటకు వెళ్లేలా చూడాలని, రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని కర్నూలు కలెక్టర్ పి. రంజిత్ బాషా, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత, రవాణా శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఉద్యానశాఖ, కమిషన్ ఏజెంట్లు, లారీ ఓనర్ల అసోసియేషన్ నాయకులతో మాట్లాడి వెంటనే కొనుగోళ్ల చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఏడీఎం నారాయణమూర్తి రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి ఆదేశాలపై కలెక్టర్ రాత్రి మార్కెటింగ్ శాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించి పక్క మార్కెట్ యార్డులోని సిబ్బందిని కూడా కర్నూలు రప్పించి వెంట వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశించినట్లు కర్నూలు మార్కెట్ యార్డు కమిటీ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం నుంచి రైతులు రాత్రి 12 గంటల నుంచి ఉదయం 8 గంటలలోపు రైతులు ఉల్లిని అమ్మకానికి యార్డుకు తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తూ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం మార్కెట్ యార్డులో నిల్వ ఉన్న ఉల్లిని ఆదివారం సాయంత్రంలోపు కొనుగోలు పూర్తి చేస్తామని ఆమె ప్రకటించారు.

పశుగణనకు సిద్ధం

- నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు
- వీడియో కాన్ఫరెన్స్‌లో పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ హెచ్చరిక

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత పశుగణన నిర్వహణపై ఈ నెల 21న సలహాలు, సూచనలు పశుసంవర్ధక శాఖ అధికారులకు, సిబ్బందికి అందించామని, ఈ బృహత్తర కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని 1.50 కోట్ల కుటుంబాలకు చెందిన పశువుల వివరాలను నమోదు చేయాల్సి ఉందని పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖల రాష్ట్ర కార్యదర్శి ఎంఎం. నాయక్ స్పష్టం చేశారు. శనివారం అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు జిల్లా నుంచి జేడీ శ్రీనివాస్, నంద్యాల జిల్లా నుంచి మోహన్ నాయక్‌తో పాటు డిప్యూటీ డైరెక్టర్లు, ఏడీఏలు తదితర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులు పశువులు, ఇతర జీవాల పెంపకందారులు సరైన సమాచారాన్ని అందించేలా అవగాహన కల్పించాలని సూచించారు. పశుగణన ప్రక్రియ పూర్తయినట్లు గుర్తుగా ప్రతి ఇంటి ముందు ఆ ఇంటి తలుపు కుడి ఎగువ మూలనలో స్టిక్కర్లు అతికించాలని తెలిపారు. పశుగణన పూర్తిగా విజయవంతం చేయడం వల్ల ఈ జీవాల పెంపకందారులకు పూర్తి స్థాయిలో జీవనోపాధికి అవసరమైన పథకాలు, కార్యక్రమాలు రూపొందించడానికి సులువు అవుతుందని నాయక్ జిల్లాల అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్రంలో 5,390 మంది ఈ బృహత్తర కార్యక్రమంలో పాల్గొంటున్నారని, 1,237 మంది సూపర్‌వైజర్లు, 45 మంది స్క్రూటినీ ఆఫీసర్లు, 21,173 గ్రామాలు, 3,929 పట్టణ వార్డుల్లో ఈ సర్వే చేపడుతున్నట్లు నాయక్ తెలిపారు.

రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా నేషనల్ హైవేస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జాతీయ రహదారుల నిర్మాణాలు, భూసేకరణ తదితర అంశాలపై నేషనల్ హైవేస్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌హెచ్-44, కర్నూలు-కడప రోడ్డు, సఫా కాలేజీ నుంచి ఆత్మకూరు రోడ్డు, సూరత్-చెన్నై రోడ్డు, మంత్రాలయం బైపాస్, నగరి-జడ్చర్ల రోడ్ల భూసేకరణకు సంబంధించి సంబంధిత రైతుల భూ రికార్డులను పరిశీలించి నష్టపరిహారాన్ని పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బి.తాండ్రపాడు నుంచి గార్గేయాపురం వరకు జరుగుతున్న ఔటర్ రింగ్ రోడ్డు పనులను నవంబరు 15వ తేదీ నాటికి పూర్తయ్యేలా పనులు వేగవంతం చేయాలని అన్నారు. మున్సిపల్ పరిధిలో ఉన్న రోడ్ల నిర్మాణ పనులను మాస్టర్ ప్లాన్ ప్రకారం చేపట్టాల ని మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబును ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఆర్డీవో సందీప్ కుమార్, నేషనల్ హైవే అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

గుంతలను పూడ్చడానికి రూ.11.16 కోట్లు మంజూరు

జిల్లాలో ఆర్‌అండ్‌బీ రోడ్లు గుంతలను పూడ్చివేసేందుకు ప్రభుత్వం 11.16 కోట్లను మంజూరు చేసిందని, డిసెంబరు ఆఖరు నాటికి ఈ మరమ్మతులు పూర్తి కావాలని కలెక్టర్ ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో వంద రోజుల లక్ష్యాల సాధనపై (ఫేజ్-2) జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి తుగ్గలి బాలురు, బాలికల గిరిజన సంక్షేమ వసతి గృహాలను వేరు చేసేందుకు కాంపౌండు వాల్ పనులకు రూ.4 లక్షలు మంజూరు చేశామని, ఆ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. వివిధ సంక్షేమ శాఖల వసతి గృహాలలో అదనంగా 374 నూతన టాయిలెట్ల ఏర్పాటుకు ఎస్టీమేట్ సిద్ధం చేసి స్వచ్ఛాంధ్ర మిషన్ ఎండీకి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత సంక్షేమ శాఖల వసతి గృహాల అధికారులను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో చిరంజీవి, సీపీవో హిమ ప్రభాకర్‌రాజు, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ కోసం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 27వ తేదీ ఆదివారం వరకు పొడిగించినట్లు గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి రంగలక్ష్మీదేవి శనివారం తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ ప్రాతిపదికన ఉంటుందని చెప్పారు. ఉచిత శిక్షణ కావాల్సిన అభ్యర్థులు ఈ నెల 27లోపు జ్ఞానభూమి వెబ్ పోర్టల్‌లో సరళమైన రీతిలో దరఖాస్తులు నమోదు చేసుకోనేందుకు సేవలు పొందుపరిచినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నవంబరు 3న ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 2,4వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు శనివారం విడుదల చేశారు. 2వ సెమిస్టర్‌లో 1068 పరీక్షలు రాయగా 214 మంది, 4వ సెమిస్టర్‌లో 1866 మంది పరీక్షలు రాయగా 460 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవాల సూచించారు.

ధనదాహంతో కుటుంబాన్ని వీధికి లాగిన జగన్

• టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి



కర్నూలు అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ధనదాహంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన కుటుంబాన్ని వీధికి లాగారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలోని తన చాంబర్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. తొమ్మిది నెలలు మోసి కని పెంచిన తల్లి.. రక్తం పంచుకు పుట్టిన చెల్లి పట్ల కూడా దుర్మార్గంగా వ్యవహరిస్తు న్నారని అన్నారు. జగన్‌కు రాజకీయాల్లో కొనసాగే హక్కు లేదన్నారు. ఆస్తి వ్యవహాలను కూర్చొని మాట్లాడుకోవాలని, అయితే కుటుంబ పరువును నడి రోడ్డులో పెట్టారని అన్నారు. తాను వ్యవహరిస్తున్న తీరుపై అంతరాత్మను ప్రశ్నించుకోవాలని జగన్‌కు సూచించారు. జగన్ మద్దతుగా వంత పాడుతున్న ఆ పార్టీ నాయకులకు సిగ్గు ఉందా? అని మండిపడ్డారు. సీఎంగా చేసిన జగన్ తీరును చూసి ప్రజలు కూడా అసహ్యించుకుంటున్నారని అన్నారు. ఇకనైనా మారాలని, నీతి వంతమైన రాజకీ యాలు చేయలేక పోతే క్షమాపణలు చెప్పి రాజకీయ సన్యాసం తీసుకోవాలని సోమిశెట్టి జగన్‌కు సూచించారు.

విద్యతో పాటు క్రీడలు అవసరం

• ఆర్‌యూ వీసీ ఎన్‌టీకే నాయక్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడలు అవసరమని ఆర్‌యూ వీసీ ఆచార్య ఎన్‌టీకే నాయక్ తెలిపారు. శనివారం సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆర్‌యు అంతర్ కళాశాలల పురుషుల క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వాలీబాల్, సెపక్‌తక్రా, చెస్, బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి విజేతలు కావాలని కోరారు. కళాశాల డీన్ వై.శౌరీలు రెడ్డి, కోఆర్డినేటర్ డా.శివకిషోర్, రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడు, ప్రిన్సిపాల్ డా.కే.శాంత, పీడీలు చంద్రశేఖర్, మూర్తయ్య, డా.కళ్యాణ్ వెంకటేశ్ పాల్గొన్నారు. వాలీబాల్ విజేతగా సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలపై ఆర్‌యూ కళాశాల జట్టు 25-23, 25-10 పాయింట్లతో గెలిచింది. పత్తికొండ జట్టుపై ఎస్‌ఆర్‌కే డీసీ జట్టు 26-24, 25-16 పాయింట్లతో గెలిచింది.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

• జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్ రావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ సుదర్శన్ రావు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ ఎస్.సుదర్శన్ రావు సూచించారు. శనివారం జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న జిగ్నాస-2కే24 ఐఎస్‌టీఈ రాష్ట్ర అవార్డుల ముగింపు నిర్వహించారు. పోస్టర్ ప్రజెంటేషన్‌లో ప్రతిభ చూపిన ఇంజనీరింగ్ కళాశాలల్లోని లెక్చరర్లు, విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. ప్రొ.రంగ జనార్దన్, ఐఎస్‌టీఈ కార్యదర్శి డా.ఈశ్వర్ రెడ్డి, విశ్రాంత ప్రొఫెసర్ ఎంఎం నాయుడు, అకడమిక్ రిలేషన్ మేనేజర్ శ్రీనివాస్ రామాంజన్, కళాశాల చైర్మన్ సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డా.బి.శ్రీనివాసులరెడ్డి, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించండి

నందికొట్కూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త డా. రామకృష్ణారావు ఆదేశించారు. శనివారం నందికొట్కూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో డివిజన్ స్థాయిలో రైతు సేవ కేంద్రాల సిబ్బందికి సామర్థ్యం పెంపుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త డా. రామకృష్ణారావు, డిఆర్‌సి ఏవో హేమలత, వ్యవసాయ సహాయ సంచాలకులు విజయశేఖర్, టెక్నికల్ వ్యవసాయ అధికారి, మిడ్తూరు, నందికొట్కూరు అగ్రికల్చర్ ఆఫీసర్లు పీరు నాయక్, షేక్షావళి, వ్యవసాయ విస్తరణ అధికారిని రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలే బలం

• టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



కరపత్రాలను విడుదల చేస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే బలమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మండలంలోని హుశేనాపురం గ్రామంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షలు ప్రమాద బీమా సౌకర్యాన్ని సీఎం చంద్రబాబు నాయుడు కల్పించారని చెప్పారు. రూ.లక్ష చెల్లిస్తే శాశ్వత సభ్యత్వం ఉంటుందన్నారు. గ్రామంలో నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి సభ్యత్వాన్ని వేగవంతం చేయాలన్నారు. టీడీపీ సభ్యత్వ నమోదులో జిల్లాలో హుశేనాపురం మొదటి స్థానంలో నిలిచేలా కష్టపడాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్‌బాషా, కేవీ మధు, బజారు, నారాయణ, వేణు, నాగరాజు, జయకృష్ణ, మహేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పని నుంచి బాలుడికి విముక్తి

కర్నూలు లీగల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తండ్రికి ఓ హత్య కేసులో జీవిత ఖైదు పడటంతో అనాథగా పొలం పనులకు వెళ్తున్న బాలుడి విషయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జోక్యం చేసుకుంది. ఈ మేరకు పాఠశాలలో చేర్పించేందుకు శనివారం ఏర్పాట్లు చేశారు. కర్నూలుకు చెందిన ఓ వ్యక్తికి హత్య కేసులో కోర్టు గతంలో జీవిత ఖైదు విధించింది. అతను కడప సెంట్రల్ జైలులో జీవిత శిక్ష అనుభవి స్తున్నాడు. అతని భార్య అంతకుముందే మరణించడంతో కొడుకుకు ఆలన పాలన లేకపోయింది. స్థానికంగా ఓ పాఠశాలలో చదువుతున్న బాలుడిని బంధువులు రోజుకు రూ.150 చొప్పున కూలి పనికి పంపసాగారు. విషయం తెలుసుకున్న తండ్రి కుమారుడి జీవితం దుర్భరమవు తున్నదని, తిరిగి ఏదైనా పాఠశాలలోకి చేర్పించాలని కడప న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకున్నాడు. కడప న్యాయ సేవాధికార సంస్థ ఆ దరఖాస్తును కర్నూలు న్యాయ సేవాధికార సంస్థకు పంపింది. దీనిపై కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది స్పందించి కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రికి విచారణ చేయాలని ఆదేశించారు. దీంతో బాలుడిని, బాలుడి చిన్నాన్నను, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ ఎస్. జుబేదాబేగంను పిలిపించి విచారించారు. బాలుడిని కడప పాఠశాలలో చేర్పిస్తే కడప సెంట్రల్ జైలులో జీవిత ఖైదీ అనుభవిస్తున్న తండ్రిని తరచూ ములాఖత్ అయ్యే అవకాశం ఉంటుందని నిర్ణయించి కడపకు పంపే ఏర్పాట్లను చేశారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో హ్యాంగ్‌ఔట్ హోటల్ వద్ద రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మృతుడి వయస్సు 35 ఏళ్లు ఉంటుంది. రోడ్డు దాటుతుండగా.. బెంగళూరు వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి వైద్యప రీక్షలు చేయించి మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి శరీరంపై పాచిరంగు ప్యాంట్, ఆకుపచ్చని అంగీ ఉన్నాయి. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ట్రాఫిక్ పోలీసులను సంప్రం దించాలని సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన బాలుడి మృతి

దేవనకొండ, అక్టోబర్26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హంద్రీలో శుక్రవారం గల్లంతైన బాలుడు మహేష్(5) మృతి చెందాడు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆచూకీ కనపడకపోవడంతో చీకటి పడేంతవరకు హంద్రీ సమీపంలో వెతికారు. శనివారం ఉదయం గ్రామ సమీపంలో హంద్రీలో బాలుడి మృతదేహం తేలియాడుతుండగా గ్రామస్తులు గుర్తించారు. బాలుడి మృతితో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

• ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం

ఆదోని రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో పాదచారుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం నెట్టేకల్ సమీపంలో జరిగింది. గ్రామానికి చెందిన బోయ నాగిరెడ్డి (49) పశుగ్రాసం కోసం తోపుడు బండితో రోడ్డుపై వెళ్తుండా చిన్నపెండేకల్లు నుండి ఆదోని వెళ్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించామని, మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

ఆర్‌ఎంపీ దారుణ హత్య

• మృతదేహాన్ని జీఎన్‌ఎస్‌ఎస్‌లో పడేసిన నిందితులు
• బెలుం శింగవరం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులపై అనుమానం



కొండయ్య(ఫైల్)

కొలిమిగుండ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెలుం గ్రామంలో ఆర్‌ఎంపీగా పనిచేస్తున్న బెల్లం కొండయ్య(50) దారుణ హత్యకు గురయ్యారు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన కొండయ్య శనివారం మధ్యాహ్నం బెలుంశింగవరం గ్రామ సమీపంలోని జీఎన్‌ఎస్‌ఎస్‌లో తీవ్రమైన గాయాలతో శవమై తేలాడు. కొండయ్య మధ్యాహ్నం నుండి కనిపించడం లేదంటూ శుక్రవారం రాత్రి భార్య వెంకటేశ్వరి కుటుంబ సభ్యులతో కలిసి కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే శనివారం మధ్యాహ్నానికే మృతదేహం జీఎన్‌ఎస్‌ఎస్‌లో బయటపడటంతో స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీశారు. ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్, కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. హత్య కేసుగా నమోదుచేసి, విచారణ చేపడుతున్నామని, మృత దేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు సీఐ తెలిపారు. కర్నూలు నుంచి డాగ్ స్క్వాడ్ రప్పించి సంఘటనా స్థలంతో తనిఖీ చేశారు.

ఒంటిపై బంగారం కోసమే హత్య..?

ఆర్‌ఎంపీ వైద్యుడు కొండయ్య ఒంటిపై ఉన్న బంగారం గొలుసు, బంగారం ఉంగరాల కోసమే ఈ హత్య జరిగినట్లు అనుమానిస్తున్నారు. బెలుంశింగవరం గ్రామ సమీపంలో తోటలో నివాసం ఉండే వృద్ధ దంపతులు హత్య చేసినట్లు స్థానికులు, పోలీసులు భావిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సదరు వృద్ధ దంపతుల నుంచి కొండయ్యకు ఫోన్ రావడంతో వైద్యం చేయడానికి వెళ్లాడని, ఆ తర్వాతనే కొండయ్య ఫోన్ స్విచ్ఛాఫ్ అయిందని పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఇప్పటికే వృద్ధ దంపతులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

'యురేనియం తవ్వకాలపై ఆందోళన వద్దు'



కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టును పరిశీలిస్తున్న ఆర్డీవో భరత్ నాయక్

దేవనకొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్టులో యురేనియం తవ్వకాలను పూర్తిస్థాయిలో జరపడం లేదని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్ సూచించారు. మండలంలోని కప్పట్రాళ్లలో శనివారం కౌలుట్లయ్య ఆలయం వద్ద ఆర్డీవో గ్రామస్థులతో మాట్లాడారు. యురేనియం నిల్వలు ఏ మేర ఉన్నాయో పరిశీలించడం కోసం 68 బోర్లు ఏర్పాటు చేయడానికి మాత్రమే అనుమతి వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం తవ్వకాలకు అనుమతులు రాలేదని, గ్రామాలు వీడాల్సిన అవసరం లేదని అన్నారు. అనంతరం వెలమకూరు రస్తా, ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆర్డీవో వెంట ఆర్ఐ రెవెన్యూ అధికారులు లోకేశ్వరరావు, విజయ్‌భాస్కర్, మండల సర్వేయర్ మేఘశ్యామ్, వీఆర్వో దాదావలి, షఫీ, సూరీడు, హనుమన్న ఉన్నారు.

కార్యకర్తల కోసమే సభ్యత్వ నమోదు

• నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి



మాట్లాడుతున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

నందికొట్కూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వం తీసుకొని టీడీపీ కుటుంబ సభ్యులుగా కావాలని నియోజకవర్గ ప్రజలకు నంద్యాల ఎంపీ డా. బైరెడ్డి శబరి పిలుపునిచ్చారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డి శబరి తన నివాసంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైందన్నారు. టీడీపీ కార్యకర్తల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని టీడీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ సభ్యత్వంలో కేవలం రూ.100తో రూ.5 లక్షల ప్రమాద బీమాతో పాటు వారి పిల్లలకు విద్యా, ఉపాధి కల్పన కూడా కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సివిల్‌సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్‌నాయుడు, నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. కాకరవాడ చిన్న వెంకటస్వామి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, అశోకరత్నం, కట్టుబడి శ్రీనివాసులు, బంగారం వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, గుణశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌర్య హాస్పిటల్ ప్రారంభం



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ, ఎంపీ శబరి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దేవనగర్‌లో 50 పడకలతో కొత్తగా ఏర్పాటు చేసిన మౌర్య హాస్పిటల్‌ను శనివారం ఉదయం మంత్రులు టీజీ భరత్ ఎన్‌ఎండీ ఫరూక్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత ప్రారంభించారు. మైనార్టీ మంత్రి ఐసీయును ప్రారంభించారు. టీడీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌ఎండీ ఫిరోజ్, ల్యాబ్ ఎక్స్‌రే యూనిట్ మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, ఓటీ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఆర్థోపెడిక్ సర్జన్ డా.ఎం.రాజేష్ కుమార్, మానసిక వైద్య నిపుణుడు డా. కంచర్ల హరిప్రసాద్, ల్యాప్రోస్కోపిక్ అండ్ బేరియాట్రిక్ సర్జన్ డా. వసీం హసన్ రాజా షేక్, మత్తు మందు వైద్యనిపుణులు డా. రఘు ప్రవీణ్ మాట్లాడుతూ ఆర్థో, మెడిసిన్, గైనిక్, సర్జరీ, సైక్రియాట్రీ, ఐసీయూ సేవలు ఇషాక్ థెరపీ, కంటి సేవలు అత్యాధునిక పద్ధతిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

పశువులపై సైకో దాడి

గోనెగండ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలోని వీధుల్లో తిరుగుతున్న గుర్తు తెలియని సైకో శుక్రవారం రాత్రి నుంచి కనిపిం చిన ఆవులను, ఎద్దులను, బర్రెలను, గొర్రెపిల్లలను కత్తితో తీవ్రంగా గాయపరుస్తున్నాడు. ఇప్పటి వరకు దాదాపు 20 ఆవులు, ఎద్దులను, రెండు బర్రెలను, ఆరు గొర్రెలను గాయపరిచినట్లు గ్రామస్తులు తెలిపారు. చింతలాముని నల్లారెడ్డి స్వామికి చెందిన పది ఆవులను గాయపరచడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. గ్రామపెద్దలు టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన నాయకులు పోలీస్‌స్టేషన్‌లో సీఐ గంగాధర్‌కు ఫిర్యాదు చేశారు. సీఐ మాట్లా డుతూ అనుమానస్పదంగా ఎవరైనా కనిపిస్తే 9121101074 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. మూగజీవాలపై దాడికి పాల్పడుతున్న సైకోను వెంటనే అరెస్టు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామ సచివాలయాల్లో సిబ్బంది కొరత

- ఉద్యోగులు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

సచివాలయంలోని బాత్‌రూమ్‌లో పడుకున్న శునకం



కొత్తపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలకు సిబ్బంది కొరత వేధిస్తోంది. కొత్తపల్లి మండలంలోని 12 గ్రామ పంచాయతీలు ఉండగా.. ప్రభుత్వం ప్రతి గ్రామ సచివాలయానికి 11 గ్రామ సచివాలయాలకు సొంత భవనాలను ఏర్పాటు చేసింది. ప్రతి సచివాలయానికి పది మంది ఉద్యోగులను ఏర్పాటు చేసి అందుకు తగ్గ సిబ్బందిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అన్ని గ్రామ సచివాలయాల్లో తగినంత సిబ్బంది లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ముఖ్యంగా నల్లమల అటవీ ప్రాంతానికి కూతవేటు దూరంలో ఉన్న ఎర్రమఠం గ్రామ సచివాలయానికి 9 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా.. కేవలం వెటర్నరీ అసిస్టెంట్, గ్రామ సర్వేయర్ మాత్రమే ఉన్నారు. ఉన్న సర్వేయర్ కూడా గ్రామాల్లో భూమి కొలతలకు వెళితే.. ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ ఏదైనా పని నిమిత్తం బయటకు వెళితే.. సచివాలయాన్ని మూసి వేసే దుస్థితికి నెలకొంది. ఈ సచివాలయంలో మహిళా పోలీసుతో పాటు వెల్ఫేర్, డిజిటల్, వ్యవసాయ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హెల్త్ ఏఎన్ఎం, వీఆర్వో పోస్టు కూడా ఖాళీగా ఉంది. పంచాయతీ సెక్రటరీ కూడా ఖాళీగా ఉండగా.. ఇటీవలనే విధుల్లో చేరినట్లు తెలుస్తుంది. అలాగే మిగిలిన 11 గ్రామ పంచాయతీల్లోని సచివాలయాల్లో కూడా దాదాపు 50 శాతం ఉద్యోగుల కొరత ఉండడంతో వివిధ పనుల నిమిత్తం సచివాలయాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి గ్రామ సచివాలయాల్లో సిబ్బందిని నియమించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇదిలా వుంటే గ్రామసచివాలయంలోని ఓ బాత్‌రూమ్‌లో పడుకున్న కుక్కను బయటికి పంపేవారు కూడా కరువయ్యారు.



సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు



ఎర్రమఠం గ్రామ సచివాలయం

వారం రోజుల నుంచి తిరుగుతున్నా



కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం వారం రోజులుగా సచివాలయాలకు తిరుగుతున్నా. ఏ ఒక్క అధికారి విధుల్లో లేకపోవడంతో ఖాళీ కుర్చీలే దర్శనం ఇస్తున్నాయి. ఎర్రమఠం గ్రామ సచివాలయంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. సమస్యలు సచివాలయం ఉన్నా లేనట్లే ఉంది. అధికారులను నియమించి సమస్యలు పరిష్కరించాలి.

- పెద్ద బిచ్చన్న, ఎర్రమఠం

సిబ్బంది కొరత లేకుండా చూస్తాం

మండలంలోని అన్ని సచివాలయాల్లో గత కొన్నేళ్లుగా సిబ్బంది కొరత ఉన్నది వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సిబ్బంది కొరత లేకుండా చూస్తాం.

- మేరీని, కొత్తపల్లి ఎంపీడీవో

మహానందిలో డీఈవో పూజలు



మహానంది ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

మహానంది, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మహానందిక్షేత్రంలో డీఈవో జనార్దన్‌రెడ్డి మహానంది, కామేశ్వరీదేవి అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. శనివారం ఆలయం వద్ద వీరికి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు శాలువాతో సన్మానించి ఆశీర్వదించారు. వీరివెంట ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, బాలిరెడ్డి, హనుమంతరావు, ఎమ్మార్పీలు చిన్నతిమ్మయ్య పాల్గొన్నారు.

‘ప్రజల దృష్టిని మళ్లించేందుకే జమిలి ఎన్నికలు’

ఆత్మకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎదుర్కొంటున్న అనేక సమస్యల నుంచి ప్రజలను మళ్లించేందుకే కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకొస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి టీ. రమేష్‌కుమార్ ఆరోపించారు. శనివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో తీవ్రమైన ఆర్థిక సంక్షోమం నెలకొందని అన్నారు. ధరలు, నిరుద్యోగ సమస్యలపై ప్రధానీ మోదీ ఆలోచించకుండా జమిలి ఎన్నికల అంశాన్ని అజెండాగా తీసుకొచ్చారని అన్నారు. దామాషా పద్ధతితో ఎన్నికలు జరపడంతో పాటు ప్రజాప్రతినిధులను ప్రజలు రీకాల్ చేసే హక్కు ప్రజలకు కల్పించాలని చెప్పారు. జమిలి ఎన్నికలతో ఫెడరల్ స్ఫూర్తి దెబ్బతింటుందన్న విషయాన్ని రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు గుర్తించకుండా జమిలికి సమర్థించడం సరికాదని ఎద్దేవా చేశారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు అప్పలనాయుడు, రణధీర్, స్వాములు, సురేంద్ర ఉన్నారు.

వ్యాపారాలలో పెట్టుబడి పెట్టండి

పాణ్యం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మనం సంపాదించిన సంపాదనను మంచి ఆలోచనతో వ్యాపారాలలో పెట్టుబడి పెట్టాలని ఎన్ఐఎస్ఎం మేనేజింగ్ డైరెక్టర్ జ్ఞాన సాయినాథ్ విశ్వనాదుని అన్నారు. శనివారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఐఈఈఈ ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాన్స్‌ఫార్మింగ్ డ్రీమ్స్ ఇన్‌టు ఫైనాన్షియల్ రియాలిటీ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఆర్థికంగా బలపడటానికి అవసరమైన వనరులు ఏర్పాటు చేసుకోవడంలో పవర్ అండ్ ఎలక్ట్రానిక్స్ సొసైటీ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, రామిరెడ్డి, హెచ్ఓడి నాగభాస్కరరెడ్డి, కోర్డినేటర్ విజయ్‌సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వరి విత్తనోత్పత్తిలో జాగ్రత్తలు పాటించండి



రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో ప్రసాదరావు

నంద్యాల రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : వరి విత్తనోత్పత్తిలో జాగ్రత్తలు పాటించాలని నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలోని బిల్లలాపురం గ్రామంలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి పూత, పాలు పోసుకునే దశలో ఉందన్నారు. అందువల్ల రైతులు వరిలో మొలచాన కేడి గింజల ఉత్పత్తి మొక్కలను తీసివేయాలన్నారు. ఇలా తీసివేయ డం వల్ల నాణ్యమైన వరి విత్తనాలను ఉత్పత్తి చేయవచ్చునని తెలిపారు. అంతేకాక కోతసమయంలో, ఆరబెట్టే సమయంలో కేడి గింజలు కలువకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. చీడపురుగులు, తెగుళ్ల నివారణకు చర్యలను విపులీకరిస్తూ, అనుసరించాల్సిన విదానాలను వివరించారు. ఈకార్యక్రమంలో విశ్రాంత శాస్త్రవేత్త రామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా రగ్బీ పోటీలు



ఉత్కంఠభరితంగా సాగుతున్న రగ్బీ పోటీలు

పాణ్యం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న రగ్బీ జూనియర్ మహిళా పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. శనివారం రెండో రోజు ఉమ్మడి జిల్లాలకు చెందిన 16 జూనియర్ విభాగాల జట్టు పాల్గొన్నాయి. పోటీలను ఆర్జీఎం విద్యాసంస్థల అధినేత డాక్టర్ శాంతిరాముడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళాభివృద్ధిలో భాగంగా చేపట్టిన రగ్బీ పోటీలు మహిళల మనోబలాన్ని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, కాంపిటీషన్ మేనేజరు వికాస్ చౌరాసియా, స్పోర్ట్స్ అథారిటీ పరిశీలకులు చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, పీడీలు వెంకటేశ్, చంద్రారెడ్డి, నాయక్, వివిధ పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.

రగ్బీ విజేతలు వీరే

మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల లో జరుగుతున్న రగ్బీ సబ్ జూనియర్ పోటీలలో మొదటి స్థానం ఆళ్లగడ్డ ఆర్బీ గురుకుల పాఠశాల సాధించినట్లు రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం జరిగిన పోటీలలో ద్వితీయ స్థానం లక్ష్మాపురం ఏపీఎస్ డబ్ల్యు ఆర్ పాఠశాల, మూడవ స్థానం ఆళ్లగడ్డ రెగ్యులర్ ఏపీఎస్ డబ్ల్యూ ఆర్ పాఠశాల సాధించిందన్నారు. విజేతలకు రూ. 50 వేలు, రూ. 30 వేలు, రూ. 20 వేలు నగదు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీఓ రాజు, ని మ్మకాయల సుధాకర్, ఏపి రెడ్డి, పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



పటేల్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

నందికొట్కూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రఘురాం మూర్తి అన్నారు. శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలోని పటేల్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. రఘురాంమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ ఆటో కార్మికులపై అధిక జరిమాణాలు విధించిన జీవో 21, 31 జీవో రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి వారు డిమాండ్ చేశారు. గత ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఆటో కార్మికులకు సమస్యలను పరిష్కారం చేస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. ఆందోళన కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ప్రసాద్, ఏపీ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ ఫెడరేషన్ పట్టణ నాయకులు నాగేంద్ర, శేషన్న, గౌడ్, వడ్డేమాన్ రవికుమార్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు చేయూతనివ్వండి

నంద్యాల రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : నంద్యాల పట్టణంలోని చిరు వ్యాపారులకు చేయూత ఇవ్వాలని చిరు వ్యాపారుల సంక్షేమ సంఘ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆకుమళ్ల రహీం కోరారు. శనివారం చిరు వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని చిరు వ్యాపారుల సంఘ నాయకులు మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, కమిషనర్ నిరంజన్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఆకుమళ్ల రహీం మాట్లాడుతూ వీధి వ్యాపారులు సంక్షేమ చట్టం ప్రకారం చిరు వ్యాపారులకు ప్రభుత్వమే స్థలాలు కేటాయించి, వారి అభివృద్ధికి సహకరించాలన్నారు. మున్సిపల్ పరిదిలో మాత్రం ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకుంటుంటే అధికారులు తొలగిస్తున్నారని పేర్కొన్నారు. చిరువ్యాపారుల కోసం ఏర్పాటు చేసిన చట్టాన్ని అమలు చేస్తూ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

గడివేములలో ట్రాఫికర్



నిలిచిపోయిన వాహనాలు

గడివేముల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గడివేములలో శనివారం ట్రాఫిక్ జామ్ అయింది. భారీగా వాహనాలు రోడ్డుపై నిలిచి పోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నందికొట్కూరు-నంద్యాల రోడ్డులో ప్రతి రోజు వందలాది వాహనాలు జిందాల్ పరిశ్రమకు రాకపోకలు సాగిస్తుంటాయి. మండల కేంద్రంలో ఇరుకు దారులు ఉండటంతో ఎదురెదురుగా వచ్చే రెండు వాహనాలు వెళ్లడం చాలా కష్టమవుతోంది. ఇటువంటి సమయంలో పంట కోత మిషన్‌లు భారీ వాహనాలకు ఎదురుగా రావడంతో గంటల కొద్ది ట్రాఫిక్ జామ్ అయింది. అధికారులు స్పందించి ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎఫ్ఎల్ఎన్ శిక్షణను వాయిదా వేయాలి

నంద్యాల రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరికి శనివారం వినతి పత్రం అందజేశారు. హిందూపురంలో నిర్వహించే ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసికి సంబంధించిన ఎఫ్ఎన్ఎల్ శిక్షణా కార్యక్రమం వాయిదా వేయాలని లేదా జిల్లా కేంద్రాలలో ఏర్పాటు చేయాలని కోరారు. దూర ప్రాంతంలో కాకుండా రెసిడెన్షియల్ పద్ధతిలో కాకుండా నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో జిల్లా కేంద్రాలలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రికి తెలియజేసి శిక్షణా కార్యక్రమాన్ని మార్పు చేసేలా కృషి చేయాలని కోరారు. నాయకులు జాకీర్‌హుసేన్, దస్తగిరిబాషా, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్టు

నందికొట్కూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలో నాటు సారా అమ్ముతున్న దారం లక్ష్మమ్మను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం నందికొట్కూరులో నాటుసారా లక్ష్మమ్మ విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ జఫ్రుల్లా, హెడ్ కానిస్టేబుళ్లు పద్మనాభం, శంకర్ నాయక్, కుమారి, కానిస్టేబుళ్లు సుధీర్, మధుప్రసాద్, సంధ్యారాణి, శ్వేతారాణి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా క్రీడలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆత్మకూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, ఫిజికల్ డైరెక్టర్ దేవానంద్ శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ కర్నూలులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి యోగా అండర్-14 విభాగంలో ఎంపిక పోటీల్లో తమ పాఠశాలకు చెందిన షేక్ అప్సాన, అండర్-17 విభాగంలో మంజులాబాయి, బాలుర అండర్-17 విభాగంలో షేక్ సాహిద్ అఫ్రీది ఎంపికైనట్లు తెలిపారు. వీరు త్వరలో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయిలో క్రీడల్లో పాల్గొనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఆత్మకూరులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శివకీర్తి అండర్-17 ఖోఖో క్రీడల్లో, సలోమి యోగా క్రీడలో ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్. శంకర్ తెలిపారు.

భూ సమస్యలను పరిష్కరించేందుకే గ్రామ సభలు

ఆత్మకూరురూరల్, అక్టోబర్ 26 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు మండలంలో రీసర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాల్లో సంబంధిత భూసమస్యలను పరిష్కరించేందుకే గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రత్నరాధిక పేర్కొన్నారు. శనివారం మండలంలోని సిద్ధాపురం గ్రామంలో గ్రామ సభను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. రెవెన్యూ గ్రామాల్లో జరిగిన రీసర్వేకు సంబంధించి రైతుల నుంచి ఏవైనా భూసమస్యలపై అర్జీలు అందించినట్లయితే వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం రీ సర్వే సంబంధిత భూసమస్యలు కలిగిన రైతుల నుండి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, టీడీపీ నాయకులు ఎస్తేరయ్య, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా



టీడీపీ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న మాండ్ర దంపతులు, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



ఆత్మకూరులో టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న దృశ్యం



నంద్యాల ఎంపీ బైరెడ్డిని శబరిని శాలువతో సన్మానిస్తున్న టీడీపీ కొత్తపల్లి మండల నాయకులు

నందికొట్కూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్త టీడీపీ సభ్యత్వం చేసుకోవాలని టీడీపీ నాయకులు మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శనివారం నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో మాండ్ర నివాసంలో టీడీపీ నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాండ్ర, ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.100తో సభ్యత్వం తీసుకుంటే ప్రమాద బీమా, తదితర ప్రయోజనాలతో పాటు కష్టపడే వారికి రాజకీయ ఎదుగుదల ఉటుందన్నారు. దివంగత ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం టీడీపీని స్థాపించారన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ సీఎం చంద్రబాబు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. టీడీపీలో సభ్యత్వం ఉండడం సమాజంలో ఎంతో గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాండ్ర ఉమాదేవి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, వేణుగోపాల్, పలుచాని మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- నియోజకవర్గంలో చేపట్టే పలు అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు చేపట్టాలని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సూచించారు. శనివారం నందికొట్కూరు మండలం అల్లూరు గ్రామంలో జరుగుతున్న డ్రైనేజీ, కల్వర్లు పనులను మాండ్రా, ఎమ్మెల్యే గిత్తా జయసూర్యలు పరిశీలించారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: టీడీపీ సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు భరోసా కలగనుందని శ్రీశైల నియోజకవర్గం టీడీపీ సీనియర్ నాయకులు కంచర్ల గోవిందరెడ్డి, పట్టణాధ్యక్షులు వేణుగోపాల్ పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరు పట్టణంలోని గరీబ్‌నగర్, ఇస్లాంపేట ఏరియాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అబ్దుల్లాపురం బాషా, షాబుద్దీన్, సుబ్బరాజు, గౌస్, రామకృష్ణ, మోమిన్ ఖలీలుల్లా, పెద్దన్న, మల్లికార్జున, శ్రీనివాసయాదవ్, షాకీర్ తదితరులు ఉన్నారు.

కొత్తపల్లి: తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు, నాయకులకు, పార్టీ అభిమానులకు రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని నంద్యాల ఎంపీ డా.బైరెడ్డి శబరి తెలిపారు. శనివారం నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి స్వగృహంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బైరెడ్డి శబరి ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు సభ్యత్వం తీసుకున్న ప్రతి కుటుంబంలోని సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తారని తెలిపారు. అనంతరం ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనను పూర్తి చేసుకుని నందికొట్కూరు వచ్చిన సందర్భంగా కొత్తపల్లి మండల నాయకులు ఆమెను శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీనాథ్ రెడ్డి, చిన్నపుల్లారెడ్డి, నాగశేషన్న, రామసుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, ఏఎస్ రాజు, పుల్లయ్యగౌడు, కర్నాటి శివారెడ్డి, పి. శివారెడ్డి, మధుసూదన్ రెడ్డి, షఫీవుల్లా, పుల్లన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తూడిచర్లలో టీడీపీ సభ్యత్వం అందజేస్తున్న మండల కన్వీనర్ వెంకటేశ్వర్లుయాదవ్

జూపాడుబంగ్లా: టీడీపీ కార్యకర్తలు, నాయకులు తప్పనిసరిగా క్రియాశీలక సభ్యత్వాలు తప్పనిసరిగా తీసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు యాదవ్ అన్నారు. మండలంలోని తూడిచర్ల గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నాగేంద్రగౌడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహానంది: మహానంది మండలం మసీదుపురం గ్రామంలో మండల టీడీపీ నాయకుడు నరాల చంద్రమౌళీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. శనివారం గ్రామంలోని పలువురు కార్యకర్తలు టీడీపీ యాప్ ద్వారా సభ్యత్వ నమోదు చేసుకున్నారు.

ఏడాదికి రెండు పంటలు సాగు చేయాలి

కోవెలకుంట్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఏడాదికి రెండు పంటలు సాగు చేసి అధిక ఆదాయం పొందాలని జిల్లావ్యవసాయాధికారి మురళీక్రిష్ణ అన్నారు. శనివారం కోవెలకుంట్ల మార్కెట్ యార్డులో సబ్ డివిజను పరిధిలోని వ్యవసాయ సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త సుధాకర్, జిల్లా వ్యవసాయ అధికారి ప్రభావతమ్మ, కోవెలకుంట్ల వ్యవసాయాధికారి నిరంజన్, దొర్నిపాడు వ్యవసాయాధికారి చంద్ర, కొలిమిగుండ్ల వ్యవసాయాధికారి జ్యోతి,సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నకేశవ ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం

చాగలమర్రి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేవేముల గ్రామ సమీపంలో వెలసిన వెల్లాల క్షేత్రంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులచే వైభవంగా పల్లకి ఉత్సవం చేశారు. అలాగే చాగలమర్రి గ్రామంలోని వీరాంజనేయ పట్టాభిరామ ఆలయాల్లో మహిళలు సామూహికంగా ప్రత్యేక పూజలు చేశారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామిని దర్శించుకున్న గౌతమ్ రెడ్డి

బేతంచెర్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలోని మద్దిలేటి స్వామి, మహాలక్ష్మి అమ్మవార్లను డోన్ టీడీపీ నాయకుడు ధర్మవరం గౌతమ్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. వేద పండితులు శేషవస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. గౌతమ్ రెడ్డి వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

బనగానపల్లెలో ఇసుక డంప్ యార్డు

- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

బనగానపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో ఇసుక డంప్ యార్డు ఏర్పాటు చేస్తామని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయం ఆవరణలో ఉచిత ఇసుక పాలసీని ప్రవేశపెట్టిన ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడుకు మంత్రి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. మంత్రి మాట్లాడుతూ పట్టణంలో డంప్ యార్డు ఏర్పాటు చేసి రవాణా ఖర్చులు మాత్రమే లబ్ధిదారులు చెల్లించి ఇసుకను పొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక అమ్ముకోవడానికి యత్నిస్తే పీడీ చట్టాన్ని అమలు చేసి జైలుకు పంపుతామన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా దీపావళికి ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. త్వరలోనే ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా మహిళలు ప్రయాణించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటి ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. రోడ్ల మరమత్తులకు 300 కోట్లు నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. నేషనల్ హైవే పనులను సింగిల్ విండో పథకం కింద నిర్మించేలా చర్యలు తీసు కుంటున్నట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, టీడీపీ నాయకులు

కార్తీక మాస పోస్టర్ విడుదల

కార్తీక మాస పోస్టర్‌ను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు శనివారం ఆవిష్కరించారు. ఆలయ ఈవో చంద్రుడు, టీడీపీ నాయకుడు మౌళీశ్వరరెడ్డి, ఆలయ ప్రధాన పూజారి మహేశ్, ఇతర పూజారులు బీసీ జనార్దన్‌రెడ్డికి కార్తీక మహోత్సవ ఆహ్వానపత్రికను అందజేశారు. ఉమామహేశ్వరస్వామివారి ప్రసాదాన్ని మంత్రి దంపతులకు వారు అందించారు. అనంతరం యాగంటి ఆలయ ఈవో చంద్రుడు మాట్లాడుతూ నవంబరు 2నుంచి కార్తీక మహోత్సవాలు ప్రారంభం కానున్నట్లు అయన తెలిపారు. నవంబరు 4న, 11న, 15న 18న 25న ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, కుంకుమార్చనలు, సహస్రనామావళి, మహానివేదన, ఉచిత ప్రసాద వితరణ, సాయంత్రం స్వామివారికి పల్లకీసేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

డ్వాక్రా మహిళ సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి

బనగానపల్లె: డ్వాక్రా సంఘాల అభివృద్ధికి వెలుగు అధికారులు కృషి చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లెలోని గెస్ట్‌హౌస్‌లో జిల్లా డీఆర్‌డీఏ వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ వైబి శ్రీధర్‌రెడ్డి, డీపీఎంయూ ఐబీ సబ్జెక్టు మేనేజర్, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజరు అధికారులతో మంత్రి బీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంక్ లింకేజి, ఓఎన్‌డీసీ, రికవరీ పలు అంశాలపై పురోగతి సాధించాలన్నారు. మహిళలు సుస్థిరమైన జీవనోపాదులు ఏర్పాటు చేసుకొనే విధంగా వెలుగు అధికారులు అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. అధికారులు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చే విధంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్, ఏపీఎం అడ్డాకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

బనగానపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): నందవరం, సంకలాపురం రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ పీవీ.కుమార్‌రెడ్డి కోరారు. శనివారం టీడీపీ కార్యాలయంలో రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో రైతులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని ఆయన తెలిపారు. త్వరలో నిధులు మంజూరు చేసి రోడ్డును నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

తాగునీరు వృథా

రుద్రవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం - ఆళ్లగడ్డ గ్రామాల మధ్య పైపులైను ఎయిర్ వాల్ లీక్ అయి రక్షిత తాగునీరంతా వృథాగా పోతోంది. సంబంధిత శాఖ అధికారులు ఇలా నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఆళ్లగడ్డ మండలానికి తాగునీరు ఇబ్బంది అవుతోంది.

వేంకటేశ్వర స్వామి ప్రత్యేక పూజలు

రుద్రవరం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాసాపురం, రుద్రవరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అల్పాహారం ఏర్పాటు చేశారు.

మొలకెత్తని జొన్న, మొక్కజొన్న

రుద్రవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు, మందలూరు గ్రామల్లో కురుస్తున్న వర్షాల ధాటికి 300 ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న మొలకెత్తకుండా పోయిందని శనివారం రైతులు వాపోయారు. చందలూరు గ్రామంలో 200 ఎకరాల్లో జొన్న పంట రైతులు సాగు చేశారు. మందలూరు గ్రామంలో 100 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. కురు స్తున్న వర్షాల ధాటికి మొలకెత్తలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ సాగు చే యాల్సి వస్తుందని రైతులు వాపోయారు.

మెనూ పాటించాలి

చాగలమర్రి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈవో అనూరాధ, ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం చాగలమర్రి ఎయిడెడ్ ఆర్‌సీఎం పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సునంద, సీఆర్పీ అమీర్ ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీఆర్‌పీ ఎస్‌ఐగా బిందు మాధవి



డోన్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): డోన్ జీఆర్‌పీ ఎస్‌ఐగా బిందుమాధవి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. కర్నూలు టూటౌన్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న బిందు మాధవి బదిలీపై డోన్ రైల్వే జీఆర్‌పీ ఎస్‌ఐగా వచ్చారు.

టీడీపీలో అన్ని వర్గాలకు సముచిత స్థానం


టీడీపీ సభ్యత్వం తీసుకుంటున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి


టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న ధర్మవరం సుబ్బారెడ్డి, కార్యకర్తలు

డోన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో అన్ని వర్గాలకు సముచిత స్థానం ఉంటుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కోట్ల ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ తొలి సభ్యత్వాన్ని ఎమ్మెల్యే కోట్ల తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ దివంగత ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఆత్మ గౌరవం కోసం టీడీపీని స్థాపించారన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ సీఎం చంద్రబాబు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చారన్నారు. డోన్ నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకుని అగ్రస్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రిక ఫణిరాజ్, వలసల రామకృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రిరమణ, భాస్కర్‌నాయుడు, ఆలేబాదు పరమేష్, గోసానిపల్లి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న సుబ్బారెడ్డి

రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెండ్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. శనివారం పట్టణంలోని ఎంఎస్‌ఆర్ కార్యాలయంలో సుబ్బారెడ్డి రూ.లక్ష చెల్లించి శాశ్వత టీడీపీ సభ్యత్వ నమోదును చేయించుకున్నారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో పని చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యకర్తలకు టీడీపీ సభ్యత్వం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆర్‌ఈ రాఘవేంద్ర, పట్టణ టీడీపీ అధ్యక్షులు సీఎం శ్రీనివాసులు, యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, ఆలా మల్లికార్జున రెడ్డి, ప్యాపిలి మండల అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు ఉంగరానిగుండ్ల రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

బనగానపల్లె , అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ఆరోగ్య విషయాలపై నిర్లక్ష్యం వహించొద్దని టంగుటూరు వైద్య అధికారి డాక్టర్ శివశంకరుడు సూచించారు. శనివారం మండలంలోని సచివాలయం ఐదులో ఏపీ మోడల్ స్కూల్, గురుకుల పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమలో ఎంపీహెచ్‌ఈవో వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది రమేశ్, గ్రేసమ్మ, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు విద్యార్థి ఎంపిక


అజిత్‌రెడ్డి

చాగలమర్రి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి పట్టణానికి చెందిన విద్యార్థి అజిత్‌రెడ్డి జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న అజిత్‌రెడ్డి ఈనెల 23నుంచి 25 వరకు నంద్యాలలో జరిగిన స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో బంగారు పతకం కైవసం చేసుకున్నారు. నవంబరులో జమ్మూ కాశ్మీర్‌లో జరిగే స్కూల్‌గేమ్స్‌లో పాల్గొంటారని విద్యార్థి తండ్రి ఓబుళరెడ్డి తెలిపారు. విద్యార్థి అజిత్ రెడ్డిని ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్లా, హెచ్‌ఎం సుస్మిత, ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యక్తిపై దాడి

ఉయ్యాలవాడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దమల్ల గ్రామానికి చెందిన సలిపెల దస్తగిరిరెడ్డిపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దాడి చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామానికి చెందిన సుక్కూర్ బాషా, చాంద్‌బాషా పాత కక్షలు మనసులో పెట్టుకొని తనపై రాళ్లతో దాడి చేశారని దస్తగిరిరెడ్డి ఫిర్యాదు చేశాడన్నారు. ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

దొర్నిపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ వెంకటేష్ సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం దొర్నిపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలను నిర్వహించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు చెన్నయ్య, దేవేంద్ర ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఉయ్యాలవాడ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరివరం గ్రామ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న కాకర్ల షణ్ముఖప్రియ రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం విద్యార్థిని అభినందించారు.

వాల్మీకి గుహలను సందర్శించిన జేసీ

ప్యాపిలి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలం లోని వాల్మీకి గుహలను శని వారం జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బోయవాండ్లపల్లి గ్రామస్థులు లక్ష్మీరంగయ్య, కంబగిరిస్వామితో మాట్లాడి గుహల చరిత్రను అడిగి తెలుసుకున్నారు. గుహల్లో స్వయంభుగా వెలసిన శివలింగం, వివిధ ఆకృతులు అద్భుతంగా ఉన్నాయని జేసీ కితాబు ఇచ్చారు. అనంతరం తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు భారతి, వీఆర్వోలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి


భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు

ఉయ్యాలవాడ, అక్టోబరు 26 (ఆంధ్ర జ్యోతి): గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ మండల కన్వీనర్ బోరెడ్డి శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కమతం కాలనీలో ఎంపీడీవో ఉమమహేశ్వర రావు ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉయ్యాలవాడ గ్రామానికి రూ. 28 లక్షలు విడుదల అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల ఓబులేసు, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఆకుల చిన్న వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ సుబ్బరాయుడు, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, ఉపాధి ఏపీవో రవిప్రకాష్, గ్రామ కార్యదర్శి జయరామిరెడ్డి, బలిజ సంఘం గౌరవ అధ్యక్షుడు జింకా వెంకటస్వామి, నాయకులు నూక చంద్రశేఖర్‌రెడ్డి, ఉప్పరమీది వెంకటేశ్వర్లు, కమతం రాముడు, రాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

చాగలమర్రి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలి ఎస్సీ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేసినట్లు హాస్టల్ వార్డెన్ ఖాసీంవలి తెలిపారు. శనివారం హాస్టళ్లకు కొత్తగా మంజూరైన 92 దుప్పట్లను పంపిణీ చేశామని అన్నారు.

డిప్యుటేషన్‌పై వెళ్లిన ఎంపీడీవో

చాగలమర్రి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మంజులవాణి డిప్యుటేషన్‌పై కర్నూలు జిల్లాకు వెళ్లారు. డీపీఆర్‌సీగా విధులు నిర్వహించేందుకు వెళ్లడంతో ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏవో రాజేంద్రప్రసాద్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఎఫ్ఎస్‌సీ బాధ్యతలు చేపట్టారు.

సభ్యత్వ నమోదుతో కుటుంబాలకు భరోసా

శిరివెళ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదుతో కార్యకర్తల కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్, మాజీ ఎంపీపీ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని వనికిందిన్నె గ్రామంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మురళి ఆధ్వర్యంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, సుబ్బరాయుడు, శేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నక్కవాగులపల్లెలో విద్యుత్ డ్రిప్పుల ధ్వంసం

డోన్ రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలవాగులపల్లె గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన డ్రిప్పులను శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైర్లను, తదితర మెటీరియల్‌ను దోచుకెళ్లారు. ఈ సంఘటనపై డోన్ ట్రాన్స్‌కో ఏఈ నాగేశ్వరరెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీటి విలువ రూ.లక్షన్నర దాకా ఉంటుందని, వాటిలో ఉపయోగించే కాపర్‌ను తిరిగి అమర్చడానికి రూ.50వేలు పైగా ఖర్చు వస్తుందని ఏఈ తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

బనగానపల్లె, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ గుండా సుప్రజ అన్నారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని ఏపీ మోడల్‌స్కూల్ విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోవిందపల్లెలో పంట కోత ప్రయోగం

శిరివెళ్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందపల్లె గ్రామంలో మొక్కజొన్న పంట కోత ప్రయోగాన్ని శనివారం నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కజొన్న దిగుబడిని ఆయన పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.